రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

చింతలపూడి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. స్థానిక డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీ బి నాగకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు మద్దతు ధర కల్పిస్తూ, రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా నగదు చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాంకేతిక సలహాలు అందించడం, విత్తనాల దగ్గర నుంచి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం వరకు ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి రైతులు కూడా సహకరించాలన్నారు. ఈ ఏడాది ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందచేస్తున్నట్లు చెప్పారు. రైతులు సంచులు సమకూర్చుకుంటే అందుకు అయిన ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. ధాన్యం సంచుల్లో నింపడం దగ్గర నుంచి కొనుగోలు కేంద్రాలకు చేరవేసే వరకు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఏడీ బి నాగకుమార్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో 30,958 ఎకరాల్లో 77,500 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. మొత్తం 39 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, యర్రంపల్లి సొసైటీ అధ్యక్షుడు అలవాల బాబు, పోతునూరు సొసైటీ అధ్యక్షుడు కందుల గోవర్ధనరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఏఓ మీనాకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణరావు, యడ్ల మోహన్‌రావు, బొల్లిన వెంకట్రావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు నాగేంద్ర

కామవరపుకోట: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో యువకుడు మృతిచెందిన ఘటన కామవరపుకోట శివారు జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో శనివారం జరిగింది. తడికలపూడి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన వేమూరి నాగేంద్ర (26) తాపీ పనిచేస్తంటాడు. శనివారం సాయంత్రం పోణంగి నుంచి బయలుదేరి టి.నరసాపురం మండలం, అల్లంచర్ల కొత్తగూడెం బంధువులు ఇంటికి వెళుతుండగా కామవరపుకోట శివారు జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో వచ్చేసరికి తను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో, తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఏలూరు ఆసుపత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తడికలపూడి ఎస్సై జయబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెం 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందుతోందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం 203వ రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల బాగోగులు కోసం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కోవలోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిలుస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళుతుంటే ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. తాము ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామంటే అది సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలనే కారణమన్నారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు సమస్యలనే కాకుండా, సలహాలు, సూచనలు ఇస్తున్నారని, వాటిని అందుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అలాగే వలంటీర్ వ్యవస్థ వల్లగాని, సచివాలయం వ్యవస్థ వల్ల గాని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగినప్పుడు ప్రజలు ఈ వ్యవస్థ వల్లే తాము సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుకోగలుతున్నామని పేర్కొనడం సంతోషాన్నిచ్చిందన్నారు. ముందుచూపు ఉన్న నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారని ఆయన పేర్కొన్నారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులతో రాబోయే 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికార పీఠం దక్కించుకుంటుందని, 175 సీట్లకు 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబుగౌడ్, బత్తిన చిన్న, మాజీ సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ కమిటీ మెంబర్ గెద్దాడ శీను, కౌన్సిలర్లు దొంతు మాధవ, లోకవరపు వెంకటేశ్వరరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ భావన ఋషి, సచివాలయం కన్వీనర్ మాకబోయిన మురళి, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ చైర్మన్ మహమ్మద్ ఆఫీస్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, పాములపత్తి శీను, కంచర్ల విష్ణు, షేక్ అమీర్, జహీర్, పెసరగంటి త్రిమూర్తులు, తాళ్లరాజు, నరేంద్ర, కోటి స్వామి, కోటపోతుల బాబి తదితరులు పాల్గొన్నారు.

గో పోషణ పథకం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, ఈఓ త్రినాధరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు

ద్వారకాతిరుమల: గో పోషణ సకల పాపాలను హరిస్తుందని శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. కొండపైన ఆయన ఛాంబర్‌లో దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావులతో కలసి శనివారం గో పోషణ పథకం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకరరావు మాట్లాడుతూ శ్రీవారి గోశాల నందు నూతనంగా గో పోషణ పథకాన్ని ప్రారంభించామన్నారు. ఈ పథకం ద్వారా నెలపాటు ఒక గోవును పోషించదలచిన భక్తులు రూ.5,116 చెల్లించాలన్నారు. ఇలా ఎన్ని నెలలైనా పోషించవచ్చన్నారు. ఈ పథకం విజయదశమి నుంచి ప్రారంభమైందని చెప్పారు. గోవులకు దాణా పెట్టడం ద్వారా నవగ్రహ శాంతి చేకూరుతుందన్నారు. తమ గోశాలలో భారత జాతి గోవులైన ఒంగోలు, దేశవాళి, గిర్, సాహివాల్, మైసూర్, నిమారి, పుంగనూరు, కాంక్రేజ్, కపిల వర్ణ గోవులు ఉన్నాయన్నారు. కావున భక్తులు గో పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన



లక్కవరంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ జ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. మండలంలోని లక్కవరం సచివాలయం-1 పరిధిలో సచివాలయం కన్వీనర్ మల్లెల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నువ్వే మానమ్మకం జగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ జ్యోతి, పార్టీ శ్రేణులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, పార్టీ నాయకులు వందనపు సూర్యప్రకాషరావు, మల్లెల్లి రామకృష్ణ, పూల శ్రీను, కొదమ సీతారాం, వలంటీర్లు మల్లెల్లి శివశంకర్, పి.ముత్యాలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికయ్యారు. 'వ్యర్థాలను తగ్గించడానికి రీసైక్లింగ్ ను ప్రోత్సహించడానికి మీరు అనుసరించు 5 అలవాట్లు' అనే అంశంపై ప్రముఖ సంస్థ టాటా బిల్డింగ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు జి.పుష్ప, జె.యామిని, యస్.హర్షిత, కె.మానస, ఆర్.అక్షయ, గంగా భవాని, యస్.జ్యోష్ణ ప్రియా ప్రతిభ కనబరిచి త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు శనివారం ప్రశంసాపత్రంతో పాటుగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు బిరుదుగడ్ల నాగేశ్వరరావు, బొడ్డు రాములు, టాటా సంస్థ ప్రతినిధి సందీప్, విద్యా కమిటీ చైర్మన్, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ కె.అంజిరెడ్డి, సర్పంచ్ శ్రీవేముల నాగేశ్వరరావు, సింహాచలం, ఏసుబాబు, ప్రసాదరెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

కూరగాయలతో వరల్డ్ కప్ ట్రోఫీ



ట్రోఫీ తయారుచేసిన విద్యార్థి శ్రీరాజ్

కామవరపుకోట: క్రికెట్ ఫీవర్ పెద్దలతోపాటు చిన్నారులను సైతం తాకుతోంది. క్రికెట్ అంటే ఇష్టంతో ఓ విద్యార్థి వరల్డ్‌క్రప్ ట్రోఫీని కూరగాయలతో రూపొందించి ఆశ్చర్యపరిచాడు. కొత్తూరు గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వెలగలేటి విన్నీ శ్రీరాజ్ దోసకాయ, ఆనపకాయ, ములక్కాయ, క్యారెట్ వంటి కూరగాయలతో తయారుచేసిన క్రికెట్ వరల్డ్ కప్ ట్రోఫీ ఆకట్టుకుంటోంది. ఆదివారం ఇండియా, ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్ పోటీలో తలపడుతుండగా ఇండియా గెలిచి ప్రపంచ విజేత కావాలని శ్రీరాజ్ ఆకాంక్షించాడు.

సహస్ర దీపాలంకరణ సేవ మండప నిర్మాణానికి శంకుస్థాపన



సహస్ర దీపాలంకరణ సేవ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవ మండప నిర్మాణానికి ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా స్వామివారి నిత్య కల్యాణ మండపం పక్కనున్న ఖాళీ స్థలంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో ఈ మండప నిర్మాణానికి ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాధరావు, దాత పీపీ రాజు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాలకు వారు పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని జరిపారు. తిరుమల తిరుపతిలో శ్రీవారికి నిర్వహిస్తున్న ఈ సహస్ర దీపాలంకరణ సేవ, త్వరలో చినవెంకన్నకు జరుగనుందని తెలిసిన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మండపాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన దాత పీపీ రాజును చైర్మన్ అభినందించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర చెలికాని రాజబాబు తదితరులున్నారు.

ఫెన్సింగ్ పీకి.. హత్యాయత్నం



ధ్వంసం చేసిన ఫెన్సింగ్, పీకేసిన పామాయిల్ మొక్కలు

లింగపాలెం: తన భూమిలో ఫెన్సింగ్ ధ్వంసం చేసి పామాయిల్ మొక్కలు పీకివేసి తన భర్తపైన, కౌలుదారుడిపైన హత్యాయత్నం చేయబోయారంటూ కలరాయనగూడేనికి చెందిన చలగుళ్ల అనసూయ శనివారం ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి. అనసూయ పేరుమీద ఉన్న 56 సెంట్ల భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను, పామాయిల్ మొక్కలను అదే గ్రామానికి చెందిన చలగుళ్ల వాయునందప్రసాద్, కార్తీక్ మరికొందరు తన అనుచరులతో కలసి శుక్రవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. అడ్డుగా వెళ్లిన పొలం కౌలుదారుడు కాట్రు వెంకట్రాజు, అనసూయ భర్త మహేంద్రరావును వారు తీవ్ర అసభ్యకరమైన పదజాలంతో తిట్టి, దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని అనసూయ ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా అడ్డుగా వెళ్లిన తనపై కూడా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. కొద్దిరోజుల క్రితం పొలానికి వెళ్లిన తమ కుమారుడు రవిచంద్రను వాయనందప్రసాద్, అనుచరులు తీవ్రంగా కొట్టి గాయపర్చగా పోలీసులు కేసునమోదు చేసి కోర్టుకు పంపగా బెయిల్‌పై అతను బయటకు రావటం జరిగింది. ఈ క్రమంలోనే వాయునందనప్రసాద్ మళ్లీ తమపై ఇలా దాడికి పాల్పడ్డాడని, తమకు రక్షణ కల్పించాలని అనసూయ పోలీసులను కోరారు. దీనిపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

లింగపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో టెన్నికాయిట్ అండర్-14, అండర్-17 బాలురు, విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు కె.గోకవరంలో శనివారం నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 120 మంది క్రీడాకారులు హాజరుకాగా, ఒక్కొక్క విభాగం నుంచి ఐదుగురు చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశామని, వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. క్రీడాకారుల వివరాలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అండర్-14 బాలికల విభాగం నుంచి కె.పుణ్యవతి, ఎ.హిమబిందు, వి.జోత్స్న, టి.జోష్త, ఆర్.సంస్కృతి, బాలుర విభాగం నుంచి ఎస్.సాయిమొహిల్, జి.సామ్యూల్, జె.చరణ్, టి.సందీప్, వై.రాజ, అండర్-17 బాలికల విభాగం నుంచి ఎం.గంగ, ఎం.పూజిత, ఎ.అరుణశ్రీ, ఐ.దుర్గాభవాని, వై.మమత, అండర్-17 బాలుర విభాగం నుంచి ఎం.పవన్‌కుమార్, ఎం.సురేష్, బి.రాజు, బి.ఆనందకుమార్, టి.దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ పంపిణీ

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరింపూడిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు విశ్వనాధ శర్మ సెక్రటరీ గొలిశెట్టి వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈఓ ఎస్‌కే అమీర్ భాష సౌజన్యంతో హైస్కూల్ విద్యార్థులకు వీటిని అందజేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య వరకు స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. బోడిపిండి సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వరరావు, మజ్జి సూరిబాబు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో గ్రావెల్ రహదారి పనులు ప్రారంభం



రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: టెక్కినవారిగూడెం గ్రామ శివారు పల్లపు పొలాల్లోకి వెళ్లేందుకు జెడ్పీ నిధులు రూ.24 లక్షలతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి ఏర్పాటుతో టెక్కినవారిగూడెం, నిమ్మలగూడెం, లక్కవరం, రాఘవరాపురం గ్రామాల రైతులకు తమ పొలాలకు రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు మట్నీడి బాబి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

కొయ్యలగూడెం: బాల్యవివాహాల పట్ల ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని డీసీపీయూ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్ అన్నారు. కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన మాసాంతర అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో రాజేష్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం జీవో 31, 39 గురించి వివరించారు. సీఆర్ఏఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ బాలల హక్కులు, వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే డీసీపీయూ కౌన్సిలర్ యు.బాలస్వామి మాట్లాడుతూ బాల్యం ప్రాముఖ్యత, తల్లిదండ్రులు, సమాజం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కౌన్సిలింగ్ ఇచ్చే విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో నయోమిరాణి, ఎం.వెంకాయమ్మ, ఎ.సరస్వతి, మండలంలోని వీఆర్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

సామాజికవేత్త పెద్దిరెడ్డి మూర్తి మృతి



బుట్టాయగూడెం: సామాజికవేత్త, గిరిజనుల ఆత్మ బంధువు పెద్దిరెడ్డి మూర్తి(55) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన పందిరిమామిడిగూడెంకు చెందిన పెద్దిరెడ్డి మూర్తి ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్ల గ్రామాల్లో విద్య, వైద్యం, మంచినీటి సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సేవలందిస్తూ గిరిజనుల ఆత్మ బంధువుగా పేరుపొందారు. మూర్తి మరణంపై ఎమ్మెల్యే బాలరాజు సంతాపం తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కేసు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): చింతలపూడి మండలం అమలాపురంలో ఈ నెల 15న విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏలూరు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. అధికారుల దాడుల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తికి రూ.53,902 అపరాధ రుసుము, మరో రూ.3 వేలు జరిమానా విధించారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వేలేరుపాడు మండలం కోయమాధవరం గ్రామానికి చెందిన పల్లా శ్యామల అనే యువతి డయాలసిస్‌తో బాధపడుతోంది. ఆమెకు వైద్యఖర్చుల నిమిత్తం దుద్దుకూరులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలరాజు ఆర్థిక సహాయం అందించారు. అలాగే ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఫోన్‌లో తెలిపారు.

టి.నరసాపురం మండల సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాల సూర్యనారాయణ రాజు

టి.నరసాపురం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ సామంతపూడి సూర్యనారాయణరాజు కలెక్టర్, జెడ్పీ చైర్మన్‌లను కోరారు. శనివారం ఏలూరులో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సామంతపూడి మాట్లాడుతూ జగనన్న కాలనీల లేఔట్లలో రహదారులు పూర్తి చేయాలని, ఇల్లు నిర్మించుకోవడానికి మౌలిక అవసరాలు త్వరితగతిన కల్పించాలని కోరారు. అలాగే బొర్రంపాలెం గ్రామంలో పీహెచ్‌సీలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకోవాలని కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్‌ను కోరారు. దీనికి స్పందించిన వారు డీఎంఅండ్‌హెచ్‌వోతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బొర్రంపాలెంలో జీఎస్‌ఆర్ స్కూల్ రోడ్‌లో ఉన్నటువంటి లేఔట్‌లో గృహాలు కట్టుకోవడానికి అనుకూలంగా లేదని కింద అంతా బండరాయ ఉందని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారని కలెక్టర్, పీడీ, జిల్లా పరిషత్ చైర్మన్ విన్నవించారు. దీనిపై వారు స్పందిస్తూ దానికి సంబంధించి స్థలం మార్పు గురించి తహసీల్దార్‌తో మాట్లాడి స్థలం మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీడీని ఆదేశించారు

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

జంగారెడ్డిగూడెం: మండలంలోని తిరుమలాపురం నుంచి పేరంపేటకు గడ్డి రవాణా చేస్తుండగా, కొత్తపేట వద్దకు వచ్చే సరికి ట్రాక్టర్ ట్రక్కు పక్క భాగం నుంచి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారువచ్చి మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్ ట్రక్కు భాగం, ఇంజిన్ కొంతభాగం మంటలో దగ్ధమైంది. ఆస్తినష్టం సుమారు రూ.4లక్షలు ఉంటుందని అంచనా వేశారు.